ఆహ్లాదం.. ఆమడదూరం

- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా చక్రవర్తుల రాఘవాచారి పార్కు
- గంజాయి బ్యాచ్‌కు షెల్టర్‌గా మారిన వైనం
- ప్రశ్నిస్తే దాడులు.. పట్టించుకోని పోలీసులు



సింగ్‌నగర్‌లోని చక్రవర్తుల రాఘవాచారి వీఎంసీ పార్కు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): చిన్నారులు, పెద్దల ఆహ్లాదం కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ. 28.50 లక్షలు ఖర్చు చేసి సింగ్‌నగర్‌లో చక్రవర్తుల రాఘవాచారి నగర పాలకసంస్థ పార్కును ప్రారంభించారు. అయితే ఆ పార్కు నేడు అసాంఘిక కార్యక్రమాలకు షెల్టర్‌గా మారింది. వేలాది రూపాయలు వెచ్చించి పార్కులో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, జిమ్, చిన్నారుల ఆట పరికరాలు తుప్పు పట్టి పిల్లలు ఆడుకునేందుకు పనికిరాకుండా పోయాయి.

రక్షణ చర్యలు నిల్

పట్టపగలే గంజాయి బ్యాచ్ పార్కులో గంజాయి, మద్యం సేవిస్తు గొడవలు పడుతుంటే పోలీసులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి గంజాయి బ్యాచ్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని వారు కోరుతున్నారు.

గంజాయి బ్యాచ్‌కు అడ్డా


పార్కులో తాగిపడేసిన మద్యం బాటిళ్లు

స్థానికులకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన పార్కును గంజాయి బ్యాచ్ తమకు అడ్డాగా మార్చుకున్నారు. గంజాయి, మద్యం సేవిస్తూ మత్తులో సేద తీరుతున్నారని స్థానిక మహిళలు చెబుతున్నారు. విద్యార్థులు సైతం వారితో చేరి గంజాయి సేవించడం దినచర్యగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగటి పూటే గంజాయి బ్యాచ్ పార్కుకు చేరుకుని పిల్లల ఆట పరికరాలపై తిష్ట వేసి గంజాయి సేవిస్తున్నారని చిన్నారుల తల్లిదండ్రులు చెబుతున్నారు. మత్తులో వారు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుని గాయపర్చుకోవడమే కాకుండా పిల్లలతో పార్కుకు వచ్చే వారిపై దాడులకు పాల్పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. దీంతో పార్కుకు వెళ్లాలంటేనే భయమేస్తోందని వారు ఆందోళన చెందుతున్నారు.

ప్రశ్నిస్తే ఇళ్లపై రాళ్ల దాడులు

పార్కులో విచ్చలవిడిగా మద్యం, గంజాయి సేవించే వారిని ప్రశ్నిస్తే ఇళ్లపై రాళ్ల దాడికి దిగుతున్నారని, తమ ద్విచక్ర వాహనాల టైర్లకు పంచర్లు చేయడం, వాహనాల్లోని విలువైన వస్తువులను దొంగలించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కును ఏర్పాటు చేస్తే తమకు, తమ పిల్లలకు ఆహ్లాదం ఉంటుందని భావించాం.. కానీ ఇలా అసాంఘిక కార్యక్రమాలకు నిలయమవుతుందని అనుకోలేదని స్థానిక మహిళలు వాపోతున్నారు.


నిరుపయోగంగా ఉన్న ఆట పరికరాలు

విద్యార్థులు బలి

పోలీసులు తగిన చర్యలు తీసుకుని గంజాయి బ్యాచ్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి. విద్యార్థులు సైతం వారితో చేరి గంజాయికి అలవాటు పడుతున్నారు. పోలీసులు గట్టి చర్యలు తీసుకోకపోతే స్థానికంగా ఉన్న యువకులు సైతం గంజాయికి బానిసలుగా మారే ప్రమాదం ఉంది.

– సురేష్, స్థానికుడు

పోలీసుల స్పందన కరువు

పార్కులో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిని పశ్నిస్తే మా ఇళ్లపై రాళ్ల దాడులు చేస్తున్నారు. అంతేకాకుండా మా వాహనాల టైర్లకు పంచర్లు చేస్తున్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాం. కానీ వారి నుంచి ఎటువంటి స్పందన లేదు.

– రాము, స్థానికుడు

క్లుప్తంగా

ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని కంచికచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో శనివారం నూతన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం కామర్స్ అధ్యాపకురాలు పీఎస్ సత్యవాణి, కే బాలకృష్ణ చొరవ తీసుకుని సొంత ఖర్చులతో ఆర్ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దాతలు, అధ్యాపకులు పీఎస్ సత్యవాణి, కే బాలకృష్ణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ వైద్యుల సంఘానికి నూతన కమిటీ


డాక్టర్ శివరామ్ అక్కినేని, అధ్యక్షుడు


డాక్టర్ తన్వీర్ అఫ్రోజ్, కార్యదర్శి


డాక్టర్ వింధ్యచౌదరి, కోశాధికారి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈఎన్‌టీ వైద్యుల సంఘం నగర శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ సర్వసభ్య సమావేశం శనివారం గవర్నర్‌పేటలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో జరిగింది. సంఘ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ శివరామ్ అక్కినేని, కార్యదర్శిగా డాక్టర్ తన్వీర్ అఫ్రోజ్, కోశాధికారిగా డాక్టర్ వింధ్యచౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక కార్యక్రమం ఈఎన్‌టీ సీనియర్ వైద్యుడు పీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ ఎంఏ రెహమాన్, డాక్టర్ మధుసూదనశర్మ, డాక్టర్ మన్నే వెంకటరత్నం సమక్షంలో జరిగింది. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ శివరామ్ అక్కినేని మాట్లాడుతూ ప్రజలకు ఈఎన్‌టీ సమస్యలపై మరింత అవగాహన పెంచేలా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా ఆరోగ్యం మెరుగుకు కృషి చేస్తామని తెలిపారు.

నాగమానసాదేవికి ప్రత్యేక పూజలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మార్గశిర మాసం ముగింపు సందర్భంగా లెనిన్ సెంటర్‌లోని ఓం షిర్డీ సాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి అభిషేకాలు చేశారు. రకరకాల పూలతో స్వామివారిని అభిషేకించారు. ముగింపు సందర్భంగా వందలాది భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వెన్నా రామాంజనేయులు, లక్ష్మీరమాదేవి, కోడెబోయిన శివప్రసాద్, కవిత దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మహిళలకు చేనేత వస్త్రధారణ పోటీలు



విజయవాడ కల్చరల్: మహిళలకు చేనేత వస్త్రాలు శోభనిస్తాయని పారిశ్రామిక వేత్త అంబటి మధుమోహన కృష్ణ అన్నారు. ఏపీ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ సృజనాత్మక సమితి, శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా మహిళలకు చేనేత వస్త్రధారణ పోటీలు, విజేతలకు బహుమతి ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మధుమోహన కృష్ణ మాట్లాడుతూ మహిళా సాధికారతను స్వాగతించాలని సూచిస్తూ సంస్థ ద్వారా ఏటా వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. సేవా సమితి వ్యవస్థాపకురాలు దూపాటి శ్రీదేవి మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మం, నైతిక విలువలు, మహిళల విజయాలను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోందన్నారు. విజయవాడ దూరదర్శన్ బాధ్యుడు కొండలరావు, స్థానిక కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి వెంకటేశ్వరరావు, సినీ నటుడు గోల్డెన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 500 మంది పోటీల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు విజేతలకు బహుమతులను అందజేశారు. నాట్యాచార్యుడు కేజీ మోహన్ గిరిజా కల్యాణం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు.

15 నుంచి సర్వీస్ ప్రొవైడర్లకు ఉచిత శిక్షణ


వీఎంసీ యూసీడీ విభాగం అధికారులకు సర్వీస్ ప్రొవైడర్ల రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తులు సమర్పిస్తున్న దృశ్యం

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలో ఆయా ప్రాంతాల్లో నివసించే వివిధరకాల సర్వీస్ ప్రొవైడర్లను గుర్తించి వారికి నైపుణ్య సాంకేతిక శిక్షణ ఇవ్వడానికి వీఎంసీ కృషి చేస్తోందని వీఎంసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ యూసీడీ విభాగం అధికారి వెంకటనారాయణ తెలిపారు. ఈ మేరకు నగరంలోని సర్వీస్ ప్రొవైడర్లను గుర్తించడానికి గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌లో శుక్ర, శనివారాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 700 మంది సర్వీస్ ప్రొవైడర్లు ఈ శిక్షణ అందుకునేందుకు దరఖాస్తు చేసుకోగా వారందరికీ జనవరి 15 నుంచి శిక్షణ అందించనున్నామని తెలిపారు. ఇందులో ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ వంటి మరమ్మతులు చేసేవారు పెయింటర్, బ్యూటీషియన్(స్త్రీలైనా, పురుషులైనా) తదితర తగిన నైపుణ్య సాంకేతిక శిక్షణ సర్టిఫికెట్ ఇవ్వటంతో పాటు జీవనోపాధి కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

దేశ చారిత్రక మూలాలు అధ్యయనం చేయాలి


ప్రసంగిస్తున్న సామవేదం

విజయవాడ కల్చరల్: మన దేశ చారిత్రక మూలాలు తెలియాలంటే పురాణాలు చదవాలని ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఋషిపీఠం విజయవాడ, భారతీయ సనాతన వేదిక ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న 'మన కోసం మన పురాణాలు' అంశంగా నిర్వహిస్తున్న ప్రసంగాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శనివారం నాటి కార్యక్రమంలో భారతీయ సనాతన ధర్మం, మూలాలు, పురాణల్లో శాస్త్ర విజ్ఞానం అంశంగా ప్రసంగించారు.

కవులకు పురాణాలు స్ఫూర్తినిస్తాయని చెప్పారు. తెలుగులో వచ్చిన కావ్యాలకు పురాణాలు ప్రేరణ కలిగించాయన్నారు. సనాతన ధర్మం సంపూర్ణ జీవితం గురించి శాస్త్రీయంగా వివరిస్తుందని పేర్కొన్నారు. దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం విశ్రాంత కార్యనిర్వహణ అధికారి కేఎస్ రామరావు కార్యక్రమాలను ప్రారంభించి ప్రసంగించారు. యువత, విద్యార్థులు సనాతన ధర్మం పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. కేబీఎస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, యాబలూరి లోకనాథశర్మ, ఋషిపీఠం ట్రస్టీ మారెపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

కుల జాబితాలో తప్పులను సరిచేయండి


తహసీల్దార్ సుగుణకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని గ్రామ సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన షెడ్యూల్ కులం (మాదిగ) జాబితాల్లో కొన్ని తప్పిదాలను సరిచేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మంద వెంకటేశ్వరరావు మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మండల తహసీల్దార్ బి.సుగుణకు శనివారం వినతి పత్రం అందజేశారు. మాదిగ కులస్తులకు బదులుగా మాల కులస్తులని కొన్ని తప్పులు ఉన్నాయని, వాటిని సరిచేయాలని వెంకటేశ్వరరావు కోరారు. హిందూ మతానికి బదులు క్రిష్టియన్ అని, ఆధార్ కార్డ్, రేషన్‌కార్డు కలిగివున్న పేర్లు సైతం కొన్ని జాబితాలో లేకపోవడం గుర్తించామని వాటిని కూడా సరిచేయాలని కోరారు. ఇలాంటి పొరబాట్ల వల్ల ఎస్సీ వర్గీకరణకు అవాంతరాలుగా వచ్చే వీలున్నందున సరిచేయించాలన్నారు. గన్నవరం నియోజకవర్గ ఎమ్మార్పీ ఇన్‌చార్జి, ఎంఎస్ నాయకులు మంద వేణుమాదిగ, చిల్లిముంత కోటేశ్వరరావు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో విద్యారంగం నిర్వీర్యం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు విద్యార్థుల భవిష్యత్ కోసం ఏం చేశారో, విద్యారంగంలో ఎటువంటి సంస్కరణలు తీసుకొచ్చారో చెప్పుకోలేని దయనీయ స్థితిలో ప్రభుత్వ పెద్దలు ఉన్నారని ఎద్దేవా చేశారు. 2014–19 మధ్య వారు ఏకంగా 1,785 స్కూళ్లను మూసివేసినట్లు గుర్తు చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చి నూతన విద్యా విధానం కోసం రూ. 73 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. డిజిటల్ విద్య కోసం 8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు రూ.1,306 కోట్లతో 9,52,925 మందికి బైజూస్ కంటెంట్ లోడ్ చేసిన ట్యాబ్‌లు అందించామన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 45 వేల స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం ఇంతవరకు విద్యా రంగానికి ఎంత కేటాయించిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని ఏ ఒక్క పాఠశాలకైనా ప్రభుత్వ గ్రాంట్ కనీసం లక్ష రూపాయలు ఇచ్చారా.? అని ప్రశ్నించారు. నాడు–నేడు, ఇంగ్లిషు మీడియం, సీబీఎస్ఈ, టోఫెల్, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ, విద్యా కానుక రద్దుతో నాణ్యమైన విద్యకు ఈ ప్రభుత్వం గండికొట్టిందని మండిపడ్డారు. గోరుముద్ద తినలేక విద్యార్థులు ధర్నాలు చేస్తూ ఆస్పత్రులకు చేరుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యా ప్రమాణాలు మెరుగుపర్చే దిశగా ఆలోచన చేయాలని.. రద్దు చేసిన కార్యక్రమాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

అంతర్జాతీయ పోటీల్లోనూ రాణించాలి


స్కేటర్ హాశీష్‌ను అభినందిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని

విజయవాడస్పోర్ట్స్: అంతర్జాతీయ పతకం సాధించి జిల్లా, రాష్ట్ర ఖ్యాతిని చాటాలని స్కేటర్ మెరుగుపాల హాశీష్‌కు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) సూచించారు. తమిళనాడులోని పొల్లాచిలో ఇటీవల జరిగిన జాతీయ ఆర్టిస్టిక్ స్కేటింగ్ పోటీల అండర్–14 ఇన్‌లైన్ ఫ్రీ స్టైల్‌లో బంగారు పతకం సాధించిన హాశీష్‌ను తన కార్యాలయంలో ఎంపీ చిన్ని శనివారం అభినందించారు. ఇదే క్రీడా స్ఫూర్తిని అంతర్జాతీయ క్రీడా వేదికపైనా ప్రదర్శించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని, హాశీష్‌ను ప్రోత్సహిస్తున్న అతని తల్లిదండ్రులు శివమాధవి, రాజును ఎంపీ ప్రశంసించారు.

పద్య నాటకానికి పూర్వ వైభవం తీసుకురావాలి


కలియుగ వైకుంఠంలో ఓ సన్నివేశం

విజయవాడ కల్చరల్: పద్యనాటకానికి పూర్వవైభవం తీసుకురావాలని శ్రీనివాసా నాట్యమండలి వ్యవస్థాపకుడు దత్తుబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, శ్రీనివాసా నాట్య మండలి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే పద్యనాటక మహోత్సవాలు గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శనివారం ప్రారంభమయ్యాయి. దత్తుబాబు మాట్లాడుతూ సత్యహరిశ్చంద్ర, పాండోద్యోగ విజయాలు, చింతామణి నాటకాలను నేటికీ ప్రజలు ఆదరిస్తూనే ఉన్నారన్నారు. తిరుపతి వెంకటకవులు, ధర్మవరం రామకృష్ణమాచార్యులు, బలిజేపల్లి లక్ష్మీకాంత కవి లాంటి వారు తెలుగు పద్య నాటకానికి జీవం పోసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రంగస్థల కళాకారులు ప్రసాద్‌బాబు, పీ కోటినాగులు, బుజ్జి సాహెబ్ సోని తదితరులు పాల్గొన్నారు. దత్తు పర్యవేక్షణలో కలియుగ వైకుంఠం, గయోపాఖ్యానం, మోహినీ విజయం, శ్రీకృష్ణ రాయబారంలోని పడక ఘట్టాన్ని ప్రదర్శించారు. నాటక ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల పోస్టర్ ఆవిష్కరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సిటీ వైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ముగ్గుల పోటీల పోస్టర్‌ను శనివారం అసోసియేషన్ అధ్యక్షుడు డీ మురళీకృష్ణంరాజుతో కలిసి ఎమ్మెల్యే, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బొండా ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు ముత్యాలంపాడు అల్లూరి సీతారామరాజు రోడ్డులో ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈనెల 9 లోపు ముత్యాలంపాడులో ఉన్న కాల్‌మీ టైలరింగ్ షాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. నాయకులు ఘంటా కృష్ణమోహన్, దాసరి పెప్సీ, గుర్రం సుబ్బారావు, లక్ష్మి, శారద పాల్గొన్నారు.

డ్రాఫ్ట్ లిస్ట్ అభ్యంతరాలను తెలపండి

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నగరంలో షెడ్యూల్డ్ కులాల సర్వేపై సామాజిక తనిఖీ జరుగుతోందని, దీనిలో భాగంగా డిసెంబర్ 26న నగరంలోని అన్ని సచివాలయాల్లో డ్రాఫ్టులిస్టును ప్రచురించామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని సచివాలయాలో ప్రచురించిన లిస్టుపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 7వ తేదీలోపు వారి రాతపూర్వకంగా సంబంధిత సచివాలయంలో అందించాలని పేర్కొన్నారు. అభ్యంతరాలన్నీ ఆన్లైన్లో నమోదు చేసిన తర్వాత విచారణ చేయించి తుది జాబితాను జనవరి 17, 2025న ప్రచురిస్తామని తెలిపారు.

జాబ్‌మేళాలో 25 మంది ఎంపిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జేకేసీ, కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన జాబ్ మేళాలో 25 మంది ఎంపికయ్యారు. జాబ్ మేళాకు మొత్తం 95 మంది హాజరు కాగా దివీస్ ల్యాబొరేటరీ వారు 25 మందిని ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి అభినందించారు. జవహర్ నా లెడ్జి సెంటర్ కోఆర్డినేటర్ జీ విజయ్ దీప్, ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ ఆశీర్వాదం, సీహెచ్ అప్పారావు, మాల్యాద్రి, దివీస్ హెచ్ఆర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి ఆలయ పరిసరాలతో పాటు ఆలయానికి చేరుకునే ఘాట్ రోడ్డు, కనకదుర్గనగర్ మార్గాన్ని ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని దుర్గగుడి ఇన్‌చార్జి ఈఓ రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలోని క్యూలు, ప్రధాన ఆలయం, ఘాట్‌రోడ్డును రామచంద్రమోహన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించి గేట్‌పాయింట్ వద్ద చెత్త, ఇనుప రాడ్లు, ఇతర సామగ్రి ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయంలోకి ప్రవేశించే మార్గం ఇలాగేనా ఉండేదంటూ అధికారులను ప్రశ్నించారు. క్యూలో దుమ్ము పట్టి ఉన్న ఫ్యాన్లను చూసి వెంటనే వాటిని శుభ్రం చేయాలని ఆదేశించారు. ఘాట్‌రోడ్డులోని మొదటి మలుపు నుంచి డోనర్ సెల్ వరకు కొండ వైపున చెత్త పేరుకుపోయిందని, 24 గంటల్లో చెత్తను శుభ్రం చేయాలని ఆదేశించారు. శానిటేషన్‌పై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన ఆలయ పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే సుమారు 25 మంది శానిటేషన్ సిబ్బంది ఘాట్‌రోడ్డుతో పాటు ఆలయ పరిసరాలు, క్యూలైన్లను శుభ్రం చేస్తూ కనిపించారు. ఇటీవల భవానీ దీక్షలు ముగియడం, ఆ తర్వాత నూతన సంవత్సరం రద్దీ, సీఎం అమ్మవారి దర్శనానికి విచ్చేసిన నేపథ్యంలోనే బారికేడ్లు, ఇతర ఇనుప సామగ్రి ఆలయ పరిసరాల్లో ఉన్నాయని దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

సినీ బజార్ ఎగ్జిబిషన్ ప్రారంభం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సంక్రాంతి సెలవుల్లో పెద్దలు, పిల్లలు ఆహ్లాదాన్ని అందించేందుకు ఈ సినీ బజార్ ఎగ్జిబిషన్ దోహదం చేస్తుందని ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు అంబటి మధుమోహన్ కృష్ణ చెప్పారు. స్థానిక చుట్టుగుంట విశాలాంధ్ర రోడ్డులోని శాతవాహన కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సినీ బజార్ ఎగ్జిబిషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఒకే టికెట్‌పై సినీ బజార్, అవెంజర్, అవతార్ ప్రదర్శనలను చూడవచ్చునని నిర్వాహకులు చెప్పారు. కార్పొరేటర్ కుక్కల అనిత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక ప్రియుల సందడి








మానవాళికి మహోదయం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్.వెంకట్రావు, చిత్రంలో బండ్ల సాంబశివరావు, రచయిత డి.పాపారావు

నగరంలో జరుగుతున్న బుక్ ఫెస్టివల్ ప్రాంగణంలో శనివారం పుస్తక ప్రియుల సందడి కనిపించింది. బుక్ స్టాల్స్‌ను విద్యార్థులు, పెద్దలు సందర్శించి కావాల్సిన పుస్తకాలను కొనుగోలు చేశారు. చరిత్ర, ఆధ్యాత్మికం, ఆర్థికం, రాజకీయం, పోటీ పరీక్షల పుస్తకాలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. పలు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. న్యాయమూర్తులు, రచయితలు, సినీ నిర్మాతలు, దర్శకులు పుస్తకావిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ